సాక్షి నిజామాబాద్

గురువారం । 3 । జూలై । 2025



పసుపు రైతులకు..

బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు పసుపు రైతులకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి అన్నారు.

- 8లో ▸



తెలంగాణపై కేంద్రం వివక్ష

కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి మండిపడ్డారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

29.6 /22.6

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పీడీఏ జిల్లా అధ్యక్షుడిగా ప్రతాప్‌గుప్తా



నూతన అధ్యక్షుడు ప్రతాప్ గుప్తాకు సన్మానం

బోధన్ : పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ (పీడీఏ) జిల్లా అధ్యక్షుడిగా బోధన్ పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ ప్రాంతానికి చెందిన చిదుర ప్రతాప్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ప్రతాప్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా పూర్ణప్రసాద్, కోశాధికారిగా విజయ్‌కుమార్‌స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో ప్రతాప్‌గుప్తాను బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. లయన్స్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకులు పోలవరపు బసవేశ్వర్‌రావు, క్లబ్ ప్రతినిధులు కొడాలి కిశోర్, వై శ్రీనివాస్‌రావు, పావులూరి వెంకటేశ్వర్‌రావు, శ్రీధర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్‌ఫ్లో



ఎస్సారెస్పీలో ప్రస్తుతం నీటి నిల్వ

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. మంగళవారం బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడం, ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురువడంతో వరద ప్రవాహం పెరిగి 6,700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నీటి మట్టం పెరుగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 304 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1065.40(16.8టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం 6 టీఎంసీల నీరు ఎక్కువగా ఉంది. గతేడాది ఇదే రోజున ప్రాజెక్టులో 10.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

'సహకారం'తో రైతులు, కార్మికులకు ప్రయోజనం



మాంచెస్టర్‌లో ప్రసంగిస్తున్న రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్ : సహకార వ్యవస్థ ద్వారా ప్రపంచవ్యాప్తంగా రైతులు, కార్మికులు, వ్యాపారులు లాభపడుతున్నారని ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ కో ఆపరేటీవ్ అలయెన్స్ (ఐసీఏ) ఆధ్వర్యంలో లండన్‌లోని మాంచెస్టర్ నగరంలో కో ఆపరేటీవ్ యాక్టివిటీస్ అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో ఆపరేటీవ్ బ్యాంక్స్ లిమిటెడ్ (ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీ) తరఫున కుంట రమేశ్‌రెడ్డి సదస్సుకు హాజరై ప్రసంగించారు. యూఎన్‌వో 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించినందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహకార సంస్థలు రైతులకు అనేక రకాల సేవలు అందిస్తున్నాయని, గ్రామీణ వ్యవస్థకు మూలాధారంగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో సహకార బ్యాంకుల ద్వారా రైతులకు అందిస్తున్న సౌకర్యాలను రమేశ్‌రెడ్డి వివరించారు.

5న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

నిజామాబాద్‌అర్బన్ : ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఈనెల 5వ తేదీన జిల్లాకు రానున్నారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. ఎస్సీ రిజర్వేషన్ అమలు, ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తే దానికి సంబంధించిన విధివిధానాలు, రిజర్వేషన్లపై సమీక్షించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు సమీక్ష సమావేశంలో వెంకటయ్య పాల్గొని అనంతరం కామారెడ్డికి వెళ్తారు.

మారుతినగర్ రోడ్ నెం.5 లో నివాసాల మధ్య నిలిచిన మురుగునీరు

కసాబ్‌గల్లీలో నీటి కుళాయి గుంతలోకి చేరిన మురుగు నీరు



నగరానికి రోగాల ముప్పు!

అస్తవ్యస్తంగా శానిటేషన్

- రోడ్ల పక్కన చెత్త కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు
- అధ్వానంగా డ్రెయినేజీలు
- మంచి నీటి కుళాయి గుంతల్లోకి మురుగునీరు
- బస్తీ దవాఖానాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో అంతంతమాత్రంగానే వైద్య సేవలు

నిజామాబాద్‌నాగారం : మున్సిపాలిటీ స్థాయి నుంచి కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన నిజామాబాద్ నగరంలో ఆ స్థాయి సౌకర్యాలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి నగరానికి రోగాల ముప్పు పొంచి ఉంది. రోడ్లపక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక పలు ప్రాంతాల్లో మంచినీటి కుళాయి గుంతల్లోకి మురుగు నీరు చేరుతోంది. దశాబ్దన్నర క్రితం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూజీడీ (అండ్ గ్రౌండ్ డ్రెయినేజీ) పనులు ఇప్పటికీ ఓ కొలిక్కి రాకపోవడం నగరంలోని పరిస్థితులకు అద్దం పడుతోంది. నిజామాబాద్ నగరంలో 60 డివిజన్లు.. ఒక్కో డివిజన్ పరిధిలో 8 నుంచి 10వరకు కాలనీలు ఉన్నాయి. సుమారు లక్షా 10వేల కుటుంబాలు ఉండగా.. 4.30లక్షల జనాభా ఉంది.

చంద్రశేఖర్‌కాలనీ, మారుతినగర్, కంఠేశ్వర్, దుబ్బ, గౌతంనగర్, కెనాల్‌కట్ట, నాగారం, సాయినగర్, గాయత్రినగర్, ఆనంద్‌నగర్, పద్మనగర్, వినాయక్‌నగర్, సీతారాంనగర్‌కాలనీ, వర్నిరోడ్, మాలపల్లి, కోజాకాలనీ, హైమద్‌పురాకాలనీ తదితర ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. అపరిశుభ్ర వాతావరణం కారణంగా కాలనీలు కంపుకొడుతున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది.

ఆరు జోన్‌లు..

కార్పొరేషన్ పరిధిలో జోన్ – 1 (నాందేవ్‌వాడ), జోన్ – 2(గోల్ హనుమాన్), జోన్ – 3(పెద్దబజార్), జోన్ – 4ఏ(రాజీవ్‌గాంధీ ఆడిటోరియం), జోన్ – 4బీ(కంఠేశ్వర్), జోన్ – 5(అర్సపల్లి) మొత్తం ఆరు జోన్‌లు ఉన్నాయి. ఒక్కో జోన్ పరిధిలో సుమారు 180 మందికిపైగా కార్మికులు, జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఒక ప్రాంతంలో డ్రెయినేజీలను శుభ్రం పరిచిన తరువాత మళ్లీ అటువైపు మూడునాలుగు నెలలపాటు రావడం లేదని స్థానికులు అంటున్నారు.

యూజీడీ.. ట్రాజెడీ

15 ఏళ్ల క్రితం నగరంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనుల వ్యవహారం ట్రాజెడీగా మిగిలింది. 2008లో రూ. 94 కోట్లతో ప్రారంభమైన పనులు మధ్యలో ఆగిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపదనలను రూ. 231 కోట్లకు పెంచినప్పటికీ పనులు పూర్తికాకపోవడంతో మళ్లీ రూ.85 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. పనుల్లో భాగంగా రోడ్లను ఎక్కడపడితే అక్కడ తవ్వారు. యూజీడీ పేరుతో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు కమిషన్‌లను జేబుల్లో వేసుకుంటున్నారని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నామమాత్ర సేవలు..

వినాయక్‌నగర్, చంద్రశేఖర్ కాలనీ, దుబ్బ, సీతారాంనగర్‌కాలనీ, అర్సపల్లి, మాలపల్లి, గౌతంనగర్‌లో మొత్తం ఏడు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండగా, నాగారం, ఖానాపూర్‌లో బస్తీ దవాఖానాలు ఉన్నాయి. అయితే ఎక్కడా కూడా సమయ పాలన పాటించడం లేదని రోగులు చెబుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు రావడం లేదంటున్నారు. కిందిస్థాయి సిబ్బంది సమయ పాలన పాటిస్తున్నా.. వైద్యులు మాత్రం ఇష్టారాజ్యంగా వస్తూవెళ్తున్నారంటున్నారు. దీంతో రోగులకు ఫార్మసిస్టులు మాత్రమే మందులు ఇచ్చి పంపిస్తున్నారు.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

నగరంలో శానిటేషన్ వ్యవస్థ సరిగాలేకపోవడంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. సరైన డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో ఎక్కడపడితే అక్కడ నీరు నిలుస్తోంది. వర్షాకాలం ప్రారంభంలోనే నగరవాసులు దగ్గు, చలి, నొప్పులు, వైరల్ ఫీవర్ తదితర వాటితో బాధపడుతూ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పిల్లలు అనారోగ్యం బారినపడితే భయంతో ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.

SAKSHI FOCUS సాక్షి ఫోకస్

కార్పొరేషన్ కహానీ - 2

జూన్‌లో నమోదైన కేసులు

డెంగీ	వైరల్ ఫీవర్	టైఫాయిడ్
25	20	189

డాక్టర్ లేరు..



నాకు కొద్దిగా జ్వరం, విపరీతమైన నొప్పులు ఉన్నాయి. డాక్టర్‌కు చూయించుకొని మందులు తీసుకుందామని వచ్చాను. డాక్టర్ లేకపోవడంతో ఫార్మసిస్ట్ మందులు ఇచ్చారు. గతంలో కూడా ఫార్మసిస్ట్‌లే మందులు ఇచ్చారు. తీసుకొని వెళ్తున్నా. – లక్ష్మి, దుబ్బ

ప్రభుత్వ దవాఖానే దిక్కు



ఆరోగ్యం బాగాలేకపోవడంతో బస్తీ దవాఖానాలో చూయించుకునేందుకు వచ్చా. కాళ్లు నొప్పి ఉన్నాయి. డాక్టర్ చూసి మందులు ఇచ్చారు. మాలాంటోళ్లకు ప్రభుత్వ ఆస్పత్రులే దిక్కు. మొన్నటి వరకు ఇక్కడ డాక్టర్లు లేకుండే. ఈ మధ్యే వచ్చారు. – పద్మ, నాగారం

రోడ్లపై మురుగునీరు



కాలనీల్లో డ్రెయినేజీలు సరిగాలేకపోవడంతో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. మురునీరు ఎక్కడపడితే అక్కడ నిలుస్తుండడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. వర్షా కాలంలో ఇబ్బందులు ఇంకా పెరుగుతున్నాయి. – విజయ్, సీతారాంనగర్‌కాలనీ

పరిమితి లేని పెట్టుబడి సాయం

- ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులందరికీ 'భరోసా'!
- 36 ఎకరాలున్న రైతులకు కూడా అందించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న కర్షకులు



డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఊహించని విధంగా పంట పెట్టుబడి సాయాన్ని అందించింది. కొంత ఆలస్యమైనప్పటికీ ఎకరాల విషయంలో పరిమితి లేకుండా రైతులందరికీ ఖరీఫ్ సీజన్‌కు 'భరోసా' కల్పించింది. గత రబీ సీజన్‌లో పెట్టుబడిసాయాన్ని నాలుగు ఎకరాలకే పరిమితం చేసిన ప్రభుత్వం.. ప్రస్తుతం 36 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. దీంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రైతు వేదికల వద్ద రైతులతో కలిసి కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు సైతం నిర్వహించారు.

రూ.300 కోట్లకు పైగా..

జిల్లాలో 2,72,596మంది రైతులకు చెందిన 5,27,746 ఎకరాలకు మొత్తం రూ.316.64కోట్ల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందజేసింది. పెట్టుబడి సాయం అందుకున్న వారిలో ఒక గుంట భూమి నుంచి 36 ఎకరాలున్న రైతులు కూడా ఉన్నారు. ఎకరానికి రూ.6వేల చొప్పున పంట పెట్టుబడి సాయాన్ని అందించగా, ఎక్కువ భూమి ఉన్న రైతులు ఎక్కువ లబ్ధి పొందారు. అత్యధికంగా బోధన్ మండలంలో 17,164 మంది రైతులు రూ.20.84 కోట్లు పొందారు. గత రబీ సీజన్‌లో అందిన పెట్టుబడి సాయాన్ని పరిశీలిస్తే నాలుగు ఎకరాల వరకు భూమి ఉన్న 2,32,484 మంది రైతులకు రూ.206.49 కోట్ల పెట్టుబడి సాయం అందింది. రబీతో పోలిస్తే చూస్తే ఖరీఫ్‌లో రైతుల కోసం ప్రభుత్వం రూ.110 కోట్లు అదనంగా వెచ్చించింది.

మొత్తం భూమికి పైసలు పడ్డయి



నాకు మొత్తం 18 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పోయిన రబీలో పంట పెట్టుబడి సాయం రాలేదు. ఇప్పుడు మొత్తం భూమికి సాయం అందింది. రూ.లక్షకు పైగా డబ్బులు బ్యాంకు ఖాతాలో పడ్డాయి. సంతోషంగా ఉంది. – నరేశ్, యువరైతు, డొంకేశ్వర్

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



నాకున్న ఆరు ఎకరాల భూమికి రూ.36 వేల పంట పెట్టుబడి సాయం అందింది. వచ్చిన డబ్బులు సాగు కోసం ఉపయోగపడ్డాయి. పెట్టుబడి సాయాన్ని అందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – రేవతిరెడ్డి, మహిళా రైతు, డొంకేశ్వర్

ఇన్వెస్టిగేషన్ టూల్‌గా సైన్స్



మాట్లాడుతున్న సీపీ సాయి చైతన్య

- నిజామాబాద్ సీపీ సాయిచైతన్య
- కమిషనరేట్‌లో బాసర జోన్ – 2 పోలీస్ డ్యూటీ మీట్
- హాజరైన నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ పోలీస్ సిబ్బంది

ఖలీల్‌వాడి: మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను, సైన్స్‌ను ఇన్వెస్టిగేషన్ టూల్‌గా మార్చుకోవాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సిబ్బందికి సూచించారు. జోన్ – 2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీమీట్ – 2025ను నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ బుధవారం ప్రారంభించారు. విధి నిర్వహణ సామర్థ్యం పెంచే ఉద్దేశంతో నిర్వహిస్తున్న మీట్‌లో మూడు రోజులపాటు డిపార్ట్‌మెంటల్ పోటీలు కొనసాగనుండగా, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. పోటీల ద్వారా పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుంచి సీఐ స్థాయి వరకు పని పద్ధతులు మెరుగుపడి ఇన్వెస్టిగేషన్ స్థాయి పెరుగుతుందని, పనిలో పోటీతత్వం అలవడుతుందని పేర్కొన్నారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫొరెన్సిక్, ఫింగర్ ప్రింట్ ఇన్వెస్టిగేషన్ ఎంపికల్లో భాగంగా నేరం జరిగిన చోట 'క్లూస్' సేకరణకు సంబంధించి పరీక్షను మొదటి రోజు నిర్వహించామన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని సీపీ పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయిలో నిర్వహించే డ్యూటీ మీట్‌కు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు బస్వారెడ్డి (అడ్మిన్), రామ్‌చందర్‌రావు(ఏఆర్), సీసీఎస్ ఏసీపీ నాగవేంద్రచారి, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ సీఐలు, ఏఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్, సీపీ



మాట్లాడుతున్న కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్ : రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొనగా, రోడ్డు ప్రమాదాల నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. 44, 63వ నంబర్ జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్న ప్రదేశాలను ఇప్పటికే బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తూ గత సమావేశాల్లో చేపట్టాల్సిన చర్యలపై తీసుకున్న నిర్ణయాలు అమలయ్యేలా చూడాలన్నారు. పోలీస్, ఆర్ అండ్ బీ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇప్పటికే కొన్ని బ్లాక్‌స్పాట్ల వద్ద చర్యలు చేపట్టడంతో 2023 సంవత్సరం నుంచి పోలిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతూ వస్తున్నాయన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పట్టణాల్లోని ముఖ్య కూడళ్లు, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక దష్టి సారించాలని అన్నారు. రోడ్లను ఆక్రమించి బోర్డులు దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని తొలగించాలని, రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. ప్రధాన రహదారులపై ధాన్యం, మొక్కజొన్న వంటి పంట దిగుబడులు ఆరబోయకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎస్‌వోగా పవన్‌కుమార్



నిజామాబాద్‌నాగారం: జిల్లా యువజన క్రీడల అధికారిగా బక్కూరి పవన్‌కుమార్ నియమితులయ్యారు. జిల్లాలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పవన్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డీవైఎస్‌వోగా నియమించారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పవన్ ప్రస్తుతం జక్రాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీగా రెండేళ్లపాటు విధులు నిర్వర్తించిన ఆయన జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మరింత గుర్తింపు తెచ్చారు. కార్యాలయ ఉద్యోగులు మహిపాల్‌రెడ్డి, దాసు, సురేశ్, మహేశ్, ప్రశాంత్, క్రీడాసంఘాల ప్రతినిధులు పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

చేపల వేటపై నిషేధం

ఎస్సారెస్పీలో రెండు నెలలపాటు..

- వేట సాగకపోతే పూట గడిచేదెట్లా అంటున్న మత్స్యకారులు
- ఉమ్మడి రాష్ట్రంలో బియ్యం, నగదు అందజేత
- ప్రస్తుతం సాయం ఊసెత్తని వైనం



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చేపలను వేటాడుతున్న మత్స్యకారులు (ఫైల్)

బాల్కొండ: చేపల పిల్లల ఉత్పత్తి కాలంగా పరిగణించే జూలై, ఆగస్టు నెలల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చేపల వేటపై అధికారులు నిషేధం విధించారు. అయితే వేట నిషేధిత కాలంలో తమ పూట గడిచేది ఎట్లా అని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో కలిపి 6 వేల మత్స్యకార కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. రెండు నెలల కాలానికి ప్రభుత్వం తమకు ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో అందిన సాయం..

చేపల వేట నిషేధం అమలులో ఉన్న కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకారులను ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి నెలకు 10 కిలోల బియ్యం, రూ.2 వేల నగదు అందించారు. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం తరువాత సాయం అందడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలు అందించే వారని, ఇప్పుడు అందడం లేదని వాపోతున్నారు. సాయం అందించని పక్షంలో తమకు ప్రత్యామ్నాయ ఉపాధిని ప్రభుత్వం చూపించాలని అంటున్నారు.

గతంలో ఇచ్చారు



జూలై, ఆగస్టు నెలలు చేపలు పిల్లలను అధికంగా ఉత్పత్తి చేసే కాలం కావడంతో ప్రతి ఏటా చేపల వేటను నిషేధిస్తారు. గతంలో మాకు బియ్యం, డబ్బులు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఆలోచించి మమ్మల్ని ఆదుకోవాలి.

– భాస్కర్, మత్స్యకారుడు

చేపలను వేటాడొద్దు

చేపలు పిల్లలను జూలై, ఆగస్టు నెలల్లో సహజ సిద్ధంగా ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి రెండు నెలలపాటు చేపలను వేటాడొద్దు. నిషేధ కాలంలో మత్స్యకారులను ఆదుకోవడానికి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదు.

– దామోదర్, ఎఫ్‌డీవో, పోచంపాడ్

క్లుప్తంగా

పీజీ పరీక్షల ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఇంటిగ్రేటెడ్ (ఐదేళ్ల) పీజీ సెమిస్టర్లకు సంబంధించిన రెగ్యులర్, ప్రాక్టికల్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపు నోటిఫికేషన్ బుధవారం వెలువడింది. పీజీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్ (థియరీ, ప్రాక్టికల్), ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ 8, 10వ సెమిస్టర్, బీఎల్‌ఐఎస్సీ 2వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ తెలిపారు. పీజీతోపాటు ఇంటిగ్రేటెడ్ పీజీ ఏపీఈ అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.500 లు ఫీజు, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, ఇంటిగ్రేటెడ్ పీసీహెచ్ అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.800 లు ఫీజు, ఎంఎస్‌ఐ, ఎంబీఏ, ఎంసీఏ అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.800 లు ఫీజు ఈ నెల 15 వరకు చెల్లించాలని కంట్రోలర్ తెలిపారు. రూ. 100ల అపరాధ రుసుముతో ఈ నెల 18వరకు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు.

బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు..

తెయూ పరిధిలోని పీజీ 1, 3, 5, 7, 9వ సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ, ఇంటిగ్రేటెడ్ పీజీ ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్, 2వ, 6వ సెమిస్టర్, ఐఎంబీఏ 8, 10వ సెమిస్టర్, బీఎల్‌ఐఎస్సీ 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు ఈ నెల 15 వరకు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ తెలిపారు. రూ. 100ల అపరాధ రుసుముతో ఈ నెల 18వరకు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సందర్శించాలని సూచించారు.

తీర్థయాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు మేనేజర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, జోగులాంబ శక్తిపీఠం దర్శనానికి బస్సు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 8న బస్సు బయలుదేరుతుందని, తిరిగి 11వ తేదీన రాత్రి 10 గంటలకు ఆర్మూర్‌కు చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ. 5100, పిల్లలకు రూ.2600 కలదన్నారు. ఆసక్తిగల భక్తులు రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ బుక్ చేసుకోవాలని తెలిపారు.

యోగా భవన్‌కు అర్బన్ ఎమ్మెల్యే విరాళం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా యోగా భవన్‌కు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కిసాన్ ఖాద్ ఎంపోరియం ద్వారా రూ.లక్ష విరాళం అందజేసినట్లు జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. తాము కోరిన వెంటనే రూ.లక్ష విరాళం అందజేసిన ఎమ్మెల్యేకు అసోసియేషన్ ప్రతినిధులు అంజయ్య గుప్తా, రఘుకుమార్ ధన్యవాదాలు తెలిపారు.


ఇన్‌చార్జి ఎంహెచ్‌వోగా రవిబాబు



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఎం రవిబాబుకు కమిషనర్ దిలీప్‌కుమార్ ఇన్‌చార్జి ఎంహెచ్‌వోగా బుధవారం అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో డీసీ రాజేంద్రకుమార్ కూడా శానిటేషన్ బాధ్యతలు నిర్వర్తించారు. శానిటేషన్ విభాగాన్ని గాడిలో పెట్టాలని కమిషనర్ రవిబాబుకు సూచించారు. బల్దియాకు పర్మినెంట్ ఎంహెచ్‌వో పోస్టు ఖాళీగా ఉంది. రెండేళ్లకు పైగా మున్సిపల్ వైద్యాధికారి లేకపోవడంతో శానిటేషన్ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, జవాన్లు అవినీతిలో కూరుకుపోయారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి సిబ్బందిని హెచ్చరించినా వారు తమ పనితీరు మార్చుకోవడం లేదు. దీంతో డీసీ రవిబాబుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

గదిలేక రోడ్డు పక్కనే..

● పిల్లలు, గర్భిణులకు టీకాలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని 35 వ వార్డులో ప్రతి బుధవారం చిన్నారులకు, గర్భిణులకు ఏఎన్‌ఎంలు టీకాలు ఇస్తుంటారు. కానీ, సరైన గది సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపక్కనే టీకాలు వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రోడ్డుపై నిలబడాలంటే ఇబ్బందిగా ఉందని, కూర్చునేందుకు సరైన స్థలం కూడా లేదని గర్భిణులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి గది కేటాయించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఎన్‌ఎంలు రాజవ్వ, ప్రవలికలో మాట్లాడగా గతంలో ఓ సంఘంలో కూర్చొని టీకాలు వేసే వాళ్లమని, ఇప్పుడు లేదన్నారు.

రికార్డుల్లో ఎక్కువ.. తరగతుల్లో తక్కువ

● నగరంలోని మమ్మదేవినగర్ ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్యలో తేడాలు
● పర్యవేక్షణ చేయని ఉన్నతాధికారులు



6వ తరగతిలో తక్కువగా ఉన్న విద్యార్థులు



నగరంలో మమ్మదేవినగర్ పాఠశాల



3వ తరగతిలోని విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు లేకపోవడంతో విద్యాబోధన, ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని మమ్మదేవినగర్ పాఠశాల నిర్వహణ చూస్తే మారుమూల ప్రాంతంలో ఉన్న పాఠశాలల నిర్వహణ ఎలా ఉంటుందో అర్థమవుతుంది. సదరు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండగా, టీచర్లు రికార్డుల్లో ఎక్కువగా చూపిస్తున్నారు.

81 మందికి 106 మంది..

మమ్మదేవినగర్ పాఠశాల ఒకటి నుంచి ఆరో తరగతి వరకు కొనసాగుతుండగా, ఐదుగురు టీచర్లు ఉన్నారు. బుధవారం 'సాక్షి' పాఠశాలను సందర్శించగా.. ఒకటో తరగతిలో 9 మంది, రెండో తరగతిలో 11 మంది, మూడో తరగతిలో 14 మంది, నాల్గో తరగతిలో 18 మంది, ఐదో తరగతిలో 16 మంది, ఆరో తరగతిలో 13 మంది మొత్తం 81మంది విద్యార్థులున్నారు. కానీ పాఠశాల ఉపాధ్యాయులు మాత్రం రికార్డుల్లో 106 మంది విద్యార్థులు చదువుతున్నట్లు నమోదు చేస్తున్నారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపడంతో టీచర్ల సర్దుబాటు నుంచి తప్పించుకొని ఇదే పాఠశాలలో కొనసాగాలనే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య కూడా 100కు పైబడి నమోదు చేస్తున్నారు. కేవలం 20 నుంచి 30 మంది విద్యార్థులు మాత్రమే ప్రతిరోజు భోజనం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బడిలోనే ఈ దుస్థితి ఉంటే జిల్లా సరిహద్దు ప్రాంతాలలోని బడుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతోనే ప్రభుత్వ బడుల్లో ఇలాంటి దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలను నిత్యం తనిఖీ చేస్తే ఇలాంటి అనేక లోటుపాట్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

పరిశీలన చేస్తాం

మమ్మదేవినగర్ పాఠశాలను తనిఖీ చేస్తాం. విద్యార్థుల సంఖ్యను పరిశీలించి, తేడాలుంటే చర్యలు తీసుకుంటాం. అదనంగా ఉన్న టీచర్లను సైతం అవసరం ఉన్న పాఠశాలలకు పంపిస్తాం.

– సాయారెడ్డి, సౌత్ మండలం ఎంఈవో, నిజామాబాద్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలి

● కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి
● ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష



ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఆర్మూర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పురోగతి సాధించాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ మున్సిపాలిటీని బుధవారం ఆయన సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలు, ప్లాట్ల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా ఆయా అంశాలలో ప్రగతిని సమీక్షించిన కలెక్టర్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ఆశించిన స్థాయిలో ప్రగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 617 మందికి ఇళ్లను మంజూరు చేయగా కేవలం 183 మాత్రమే గ్రౌండింగ్ జరిగాయన్నారు. అధికారులు, వార్డు ఆఫీసర్ల పనితీరును ఆక్షేపించారు. అలసత్వ వైఖరిని వీడాలని, ఇకనైనా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. వచ్చే వారం మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించాలని అన్నారు. వన మహోత్సవం విజయవంతం అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన ప్లాట్ల క్రమబద్ధీకరణ అనుమతి మంజూరు చేయాలన్నారు.

పనులు ప్రారంభించాలి

పట్టణంలోని 11, 12 వార్డులలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులను కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి కలిశారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. మంజూరీ లభించినందున వెంటనే పనులు ప్రారంభించాలని హితవు పలికారు. ఆయన వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు ఉన్నారు.

అడ్మిషన్లు ఒకచోట.. చదువులు మరోచోట..

● పాత వర్నిలో జ్యోతిబా పూలే విద్యాలయం నిర్వాకం
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



వర్నిలోని జ్యోతిబా పూలే బాలికల పాఠశాల

వర్ని: మండలంలోని పాత వర్నిలో జ్యోతిబా పూలే బాలికల పాఠశాల, కళాశాల ఉంది. ఇక్కడ పాఠశాల స్థాయి విద్యా బోధన కొనసాగుతుండగా, ఇంటర్, డిగ్రీ కళాశాల పేరుకే ఇక్కడ ఉంది. ఇంటర్, డిగ్రీలో అడ్మిషన్లు మాత్రమే ఇక్కడ తీసుకుంటున్నారు. బోధన మాత్రం ఇంటర్ విద్యార్థులకు కామారెడ్డి జిల్లాలోని పిట్లం మండల కేంద్రంలో, డిగ్రీ విద్యార్థులకు జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లిలో చేస్తున్నారు. దీంతో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గదుల కొరతే కారణం..

ఈ విద్యాలయంలో ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యా బోధన అందించాల్సి ఉండగా భవనాల కొరతతో గత మూడు సంవత్సరాలుగా ఇంటర్ పిట్లంలో, డిగ్రీ మునిపల్లిలో కొనసాగిస్తున్నారు. వర్నిలో కేవలం ఐదు తరగతులను నడిపేందుకు గదులు ఉండటంతో ఇంటర్, డిగ్రీ బోధన ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులుండగా మొదటి సంవత్సరంలో 38, ద్వితీయ సంవత్సరంలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. డిగ్రీలో 8 సబ్జెక్టులకు గాను 320 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యాలయంలో కళాశాలను నిర్వహించాలంటే సుమారు 30 గదులు ఉంటేనే బోధనకు సాధ్యమవుతుంది. ప్రస్తుతం 10 గదుల్లో మాత్రమే విద్యాబోధన, హాస్టల్ కొనసాగుతోంది. ఆరుకొర వసతుల మధ్య కళాశాల నిర్వహణ కొనసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, విద్యాలయానికి తగిన భవనాలు, గదులను నిర్మించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

హైస్కూల్ మాత్రమే నిర్వహిస్తున్నాం..

విద్యాలయంలో కళాశాల బోధన కొనసాగించాలంటే మరో 25 గదుల వరకు అవసరం ఉంటుంది. ప్రస్తుతం 10 గదుల్లో హైస్కూల్ సెక్షన్ మాత్రమే నిర్వహిస్తున్నాం. హాస్టల్ నిర్వహణకు కూడా గదుల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కళాశాల నిర్వహణకు నిధులు మంజూరు చేసి, అదనపు గదులు నిర్మించాలి.

–పద్మజ, ప్రిన్సిపాల్, జ్యోతిబా పూలే విద్యాలయం, వర్ని

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లా వాసి మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లా అక్కన్నపేటకు చెందిన ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేటకు చెందిన కొత్తెన్న లక్ష్మీనారాయణ(54) జంగంపల్లి గ్రామశివారులోని విజయ సాయి ల్యాబొరేటరీలో ఫిట్టర్‌గా పనిచేస్తూ అదే గ్రామంలో అద్దెకు ఉంటున్నాడు. బుధవారం వ్యక్తిగత పనుల నిమిత్తం అక్కన్నపేట గ్రామానికి బైక్‌పై ఉదయం వెళ్లి మధ్యాహ్నం తిరిగి జంగంపల్లికి వస్తున్నాడు. భిక్కనూరు దర్గా సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి కంటైనర్ ఢీకొట్టడంతో లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



అన్వేశ్ (ఫైల్)

కమ్మర్‌పల్లి: ఒమన్ దేశంలో ఆత్మహత్యకు పాల్పడిన కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్ గ్రామానికి చెందిన జంబురాత్ అన్వేశ్(27) మృతదేహం బుధవారం రాత్రి స్వగ్రామానికి చేరుకుంది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. 15 రోజుల క్రితం అన్వేశ్ ఆత్మహత్యకు పాల్పడగా, మృతదేహం తీసుకురావడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు రాష్ట్ర ఐసీఐబీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ నేత సునీల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు గల్ఫ్ జేఏసీ భీమ్‌రెడ్డితో మాట్లాడి, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు తెలిపారు. ఎంబసీ అధికారులతో మాట్లాడి మృతదేహం స్వగ్రామానికి రావడానికి కృషి చేశారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలం తొర్తి ఆలయాల్లో దొంగతనం చేసిన కేసులో ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భీమ్‌గల్ సీఐ పీ సత్యనారాయణ వివరాలను వెల్లడించారు. ఉప్లూర్ ఎల్లమ్మ, పోచమ్మ, పెద్దమ్మ ఆలయాలు, కమ్మర్‌పల్లి గంగపుత్రుల హన్మాన్, ఏర్గట్ల మండలం తొర్తిలో శుక్రవారందేవీ ఆలయాల్లో మూడు నెలల క్రితం చోరీ జరిగింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న జగిత్యాల జిల్లా కొత్తపల్లి మండలం దేగుర్ల గ్రామానికి చెందిన తూర్పాటి కనకయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా ఆలయాల్లో దొంగతనానికి పాల్పడింది తానేనని ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.2,700 నగదుతోపాటు ఆలయాల్లో దొంగిలించిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదనలో పాల్గొన్న ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు షౌకత్ అలీ, నవీన్‌చంద్ర, వినయ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు

● రూ.60 వేలు జరిమానా

కామారెడ్డి క్రైం: పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2022 జులై 2న లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి నిద్రపోయాడు. రాత్రి 10 గంటల సమయంలో లేచి చూడగా తన 14 ఏళ్ల వయస్సు కలిగిన కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పక్కనే ఉండే గాంధీ నగర్‌కు చెందిన 20ఏళ్ల అక్కరేని శ్రీకాంత్ అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ మైనర్ బాలికతో పరిచయం ఏర్పరచుకున్నాడు. ఫోన్ నెంబర్ తీసుకొని తరచూ వేధించేవాడని పోలీసుల విచారణలో తెలిసింది. 2022 జులై 2 న బాలికను మాయమాటలు చెప్పి రాత్రివేళ ఇంట్లో నుంచి బయటకు రమ్మన్నాడు. ఆమెను బైక్‌పై ఎక్కించుకొని మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని కొడిపాక గ్రామానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి బాలిక కోసం వెతుకుతున్నారని తెలుసుకున్న శ్రీకాంత్ మూడు రోజుల తర్వాత బాలికను తీసుకువచ్చి లింగంపేట పోలీస్ స్టేషన్ వద్ద వదిలి పరారయ్యాడు. తర్వాత కొద్దిరోజులకు పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.60 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన డీఎస్పీలు శశాంక్ రెడ్డి, శ్రీనివాస్ రావు, ఎస్సైలు శ్రీకాంత్, వెంకట్ రావు, పీపీ శేషు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

పహాణి అంటే..?

మీకు తెలుసా?



పహాణి అంటే భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డుల ముఖ్యమైన పత్రం. దీనిని అడంగల్ అని కూడా అంటారు.

● పహాణీలో భూమి యజమాని, సాగు చేస్తున్న వారి పేరు, సర్వే నంబర్, ఖాతా నంబర్, భూమి యొక్క విస్తీర్ణం, కౌలుదారులు ఉంటాయి.
● భూమికి నీటి సదుపాయం(బావి, కాలువ, చెరువు), నేల రకం(సారవంతమైన, రాతి నేల) అనే స్వభావం పేర్కొనబడి ఉంటుంది.
● పహణీలో భూమిలో సాగు చేస్తున్న పంటల వివరాలు, ఇతర ముఖ్యమైన సమాచారం ఉంటుంది.
● పహణీ భూమి యజమానికి చట్టపరమైన హక్కులను కల్పిస్తుంది. భూమి కొనుగోలు, అమ్మకం లేదా బదిలీ సమయంలో చాలా ఉపయోగపడుతుంది.
● భూమికి సంబంధించిన వివాదాలను పరిష్కరించే సమయంలో ఉపయోగపడుతుంది.
● బ్యాంకు నుంచి పంట రుణం, ఇతర రుణాలు తీసుకోవడానికి, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి పహణీ ఉపయోగపడుతుంది.

– బాల్కొండ

తెలంగాణపై కేంద్రం వివక్ష

● ఎరువుల కేటాయింపులో జాప్యం
● పట్టించుకోని కేంద్రమంత్రులు
● తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్ రెడ్డి



హరిత భవన్‌లో మాట్లాడుతున్న చైర్మన్ అన్వేశ్ రెడ్డి

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్షచూపుతూ, రాష్ట్రానికి సరిపడా ఎరువుల కేటాయించకుండా పక్షపాతం వహిస్తోందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్ రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌లోని హాకా భవన్ (సీడ్స్ కార్పొరేషన్)లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు సంక్షేమ పాలన సాగిస్తుంటే ప్రధాని మోదీ సహకరించడం లేదన్నారు. కేంద్రమంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్‌రెడ్డి తెలంగాణకు నిధుల తేవడంలో విఫలమయ్యారన్నారు. పంటపొలాలకు వాడే యూరియా కూడా సరిగా సరఫరా జరగడం లేదన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించిన కోటా కింద 5 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయిస్తే.. 3.06 లక్షల మెట్రిక్ టన్నులు రావడంతో 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఏర్పడిందన్నారు. సరిపడా ఎరువులు లేకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఎరువుల కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు లేఖలు రాశారని గుర్తుచేశారు. సంబంధిత కేంద్ర మంత్రులు జగత్ ప్రకాశ్ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్‌‌పై బీజేపీ మంత్రులు, ఎంపీలు ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. బీజేపీ నాయకుల వైఖరి చూస్తుంటే.. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసి ఆ పాపాన్ని కాంగ్రెస్ మీదకు నెట్టే కుట్ర పూరిత వైఖరి అవలంభిస్తోందన్న అనుమానం కలుగుతోందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పసుపు రైతులకు క్షమాపణలు చెప్పాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి

● బోర్డు ఏర్పాటుతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల అక్కసు
● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి

సుభాష్‌నగర్: పసుపు బోర్డు ఏర్పాటు కావడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి విమర్శించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో పసుపు పడేళ్ల అధికారంలో ఉండి కూడా పసుపు రైతులకు ఏం చేయలేదని విమర్శించారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండి బీఆర్‌ఎస్, 18 నెలలుగా కాంగ్రెస్ పసుపు రైతులకు ఏం చేయలేదని, వెంటనే వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనకు అర్థం కావడంలేదని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. పసుపు రైతులు నామినేషన్ వేసి ఓడించిన విషయాన్ని కవిత మర్చిపోయిందా అని ప్రశ్నించారు. 18 నెలలు గడిచినా సుదర్శన్‌రెడ్డికి లెటర్ ప్యాడ్ లేదని, మరో ఎమ్మెల్యే భూపతిరెడ్డికి క్యాంపు కార్యాలయం లేదని ఎద్దేవా చేశారు. పసుపు బోర్డుతో ప్రయోజనాలేంటో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వివరించారని, పక్కనే ఉన్న భూపతిరెడ్డికి అర్థం కాలేదా అని ప్రశ్నించారు. బోర్డుకు శాశ్వత కార్యాలయం కోసం జెడ్పీ ఆవరణలో 2 ఎకరాల స్థలం కావాలని కలెక్టర్‌కు లేఖ రాశామన్నారు. పసుపు బోర్డు క్రెడిట్ అర్వింద్‌దే దక్కుతుందని, విమర్శలు చేసే వారికి ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, గంగోని సంతోష్, ఆనంతరెడ్డి, నారాయణ యాదవ్, బద్ధం కిషన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనం లేక.. ఇంటికి రాలేక..

● కువైట్‌లో నరకయాతన అనుభవిస్తున్న వలస కార్మికులు
● స్వదేశానికి రప్పించాలని సామాజిక మాధ్యమాల ద్వారా వేడుకోలు



కువైట్‌లో వలస కార్మికులు

మోర్తాడ్(బాల్కొండ): ఎన్నో ఆశలతో ఉపాధిని వెతుక్కుంటూ కువైట్‌కు వెళ్లిన ముగ్గురు వలస కార్మికులు యజమాని వంచనతో నరకయాతన అనుభవిస్తున్నారు. భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌కు చెందిన నరేశ్, పవన్, కరీంనగర్ జిల్లా గన్నేరువరానికి చెందిన కోంపల్లి ప్రణీత్‌లు తమ వేదనను సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. కువైట్‌లో ఒక వ్యాపారి వద్ద పని కోసం ఏజెంట్ల ద్వారా పది నెలల కింద వెళ్లారు. పనిచేయించుకున్న యజమాని చేసిన పనికి వేతనం ఇవ్వలేదు. జీతం లేకపోవడంతో యజమాని నుంచి పాస్‌పోర్టులు తీసుకుని బయటకు వచ్చారు. ఫలితంగా వర్క్ పర్మిట్‌ను కోల్పోయారు. ఇంటికి వచ్చేందుకు ఎంబసీలో సంప్రదిస్తే క్రిమినల్ కేసు నమోదైనట్లు ఉందని, ఇంటికి వెళ్లలేరని అధికారులు స్పష్టం చేశారు. వేతనం ఇవ్వకుండా వేధించడమే కాకుండా యజమాని తమపై తప్పుడు కేసులు పెట్టాడని వలస కార్మికులు వాపోతున్నారు. కేసును ఎదుర్కొనేందుకు లాయర్‌కు ఫీజు చెల్లించే స్తోమత తమకు లేదని వలస కార్మికులు వెల్లడిస్తున్నారు. తాము పడుతున్న కష్టాలను వీడియో రూపంలో ట్విట్టర్ ద్వారా బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావుకు విన్నవించారు. హరీశ్‌రావు, కేటీఆర్‌లు స్పందించి తమను ఎలాగైనా ఇంటికి రప్పించాలని వారు వేడుకున్నారు. తమవారిని ఎలాగైనా ఇంటికి రప్పించాలని బాధిత కుటుంబాల సభ్యులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



రుద్రూర్: కోటగిరి గ్రామ శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నవాబుపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మర్పల్లి గ్రామానికి చెందిన వడ్ల మనోహర్(18) అనే యువకుడు బుధవారం వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని ఎస్సై పేర్కొన్నారు.